క్లుప్తంగా

ఆలయాల భూముల వేలం



ఇంజేడు లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వేలం పాట నిర్వహిస్తున్న ఈఓ

ఉయ్యాలవాడ: మండలంలోని ఇంజేడు గ్రామంలో వెలిసిన విఘ్నేశ్వర, అగస్త్యేశ్వర, భోగేశ్వర, వేంకటేశ్వరస్వామి ఆలయాల భూములకు ఏడాదికి కౌలు సాగు కోసం గురువారం ఆలయంలో దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి చంద్రుడు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. 52.09 ఎకరాలను పలువురు రైతులు రూ.5.49 లక్షలకు వేలం పాట ద్వారా భూములు దక్కించుకున్నారు. కార్యక్రమంలో బనగానపల్లె డివిజన్ దేవదాయ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, గ్రామ పెద్దలు గజ్జెల క్రిష్టారెడ్డి, మారంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కామిరెడ్డి విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

రుద్రవరంలో..

రుద్రవరం: మండల పరిధిలోని పెద్దకంబలూరు ఆంజనేయ స్వామి ఆలయానికి సంబంధించిన 22.96 ఎకరాల మాన్యం భూములకు గురువారం దేవదాయశాఖ అధికారులు ఏడాదికి కౌలు వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ రామంజనేయ శర్మ మాట్లాడుతూ వివిధ సర్వే నంబర్లలో ఉన్న పొలాలను మూడు బిట్లుగా చేసి కౌలు వేలం నిర్వహించగా రూ.3.44 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు.

తాగునీరు అందించండి



ఇన్ క్లోరినేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రుద్రవరం: ప్రజల దాహం తీర్చేందుకు శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయాలని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి అధికారులకు సూచించారు. మండల పరిధిలోని బీరవోలు, ఎల్లావత్తుల, చిన్నకంబలూరు తదితర గ్రామాల్లోని వాటర్ ప్లాంట్లను, గ్రామ పంచాయతీల ఇన్ క్లోరినేషన్‌లను గురువారం ఆమె పరిశీలించారు. ప్లాంట్ల నిర్వాహకులు, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేస్తూ సురక్షితమైన నీటిని అందించాలన్నారు. ప్రభుత్వం అప్పగించిన సర్వేలు, ఆధార్ లేని పిల్లల వివరాలు సేకరించాలని సిబ్బందికి సూచించారు.

ఆర్‌ఓ ప్లాంట్ తనిఖీ

ఉయ్యాలవాడ: మండల కేంద్రంలోని ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి స్వచ్ఛతపై పరీక్షలు నిర్వహించామన్నారు. నీటిలో ఉండాల్సిన క్లోరినేషన్ సంతృప్తికర స్థాయిలో ఉందన్నారు. ప్లాంట్ ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌క్రిష్ణ, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం సాగించండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫ్యాక్షన్ జోన్ సీఐ

రుద్రవరం: గొడవల జోలికి వెళ్లకుండా ప్రతిఒక్కరూ ప్రశాంత జీవనం సాగించాలని ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని చిన్నకంబలూరు గ్రామంలో ఆయన గురువారం పర్యటించారు. ప్రజలను ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ చిన్నచిన్న కారణాలకు గొడవలు పడి స్టేషన్లు, కోర్టులు, జైలు పాలు కావద్దని సూచించారు. కలిసిమెలిసి ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

నేడు రాతిదూలం లాగుడు పోటీలు


కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఉభయ రాష్ట్రాల స్థాయి వృషభాల రాతిదూలం లాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో న్యూ కేటగిరి ఎడ్ల బలప్రదర్శన పోటీలను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. పోటీల్లో విజేతగా నిలిచిన వృషభాల యజమానికి మొదటి బహుమతిగా రూ. 1.10 లక్షలు, ద్వితీయ రూ. 90 వేలు, తృతీయ బహుమతి రూ. 70 వేలు, తర్వాతి వరుస స్థానాల్లో రూ. 50 వేలు, రూ. 40 వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు అందజేస్తారన్నారు. ఎద్దుల యజమానులు ఆలయ కమిటీని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

కనుల పండువగా రథోత్సవం

అవుకు: పట్టణంలో శ్రీ భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను నూతనంగా తయారు చేసిన రథంపై కొలువు తీర్చారు. మేళతాలతో రథోత్సవాన్ని ప్రారంభించారు. తేరు వీధి నుంచి రథోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత చల్లా విగ్నేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కేరళ వాయిద్యాలు ప్రత్యేకంగా ఆకర్షించాయి.

విద్యార్థుల ఉత్తీర్ణతే లక్ష్యంగా..

- 'పది'లో ఫెయిల్ అయిన వారికి ప్రత్యేక తరగతులు
- మండలంలో 395కు 337 మంది పది విద్యార్థులు పాస్
- మొదటిసారి విద్యార్థులకు రెగ్యులర్ అవకాశం
- అధికంగా లెక్కలు 42, సైన్స్‌లో 29 మంది విద్యార్థులు ఫెయిల్
- ఈనెల 19 నుంచి 28 వరకు సప్లిమెంటరీ పరీక్షలు



గోస్పాడులో ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

గోస్పాడు: పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గత నెల 23న మార్చిలో రాసిన పరీక్షల ఫలితాలు వెలువడగా..మండలంలో 395 మంది విద్యార్థులకు 310 మంది పాసవ్వగా 85 మంది ఫెయిల్ అయ్యారు. వీరు చదువులో వెనకబాటు లేకుండా ఉండేందుకు ప్రత్యేకంగా సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తూ వారిని సైతం రెగ్యులర్ విద్యార్థులతో పాటు విద్యాభ్యాసం సాగేలా అవకాశం కల్పిస్తూ విద్యాశాఖ ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. మండలంలో ఐదు హైస్కూళ్లు ఉండగా.. వాటి పరిధిలో అధికంగా లెక్కలు 42, సైన్స్ సబ్జెక్టుల్లో 29 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. పరీక్షల సమయం ముంచుకొస్తున్నందున వారిలో ఆందోళనను తొలగించేందుకు విద్యార్థులు వారిని సిద్ధం చేస్తున్నారు.

ప్రత్యేకంగా తరగతులు..

పదిలో ఫెయిల్ అయిన వారికోసం ప్రత్యేక తరగతులు ఆయా పాఠశాలల పరిధిలో నిర్వహిస్తున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం వేళల్లో మాత్రమే వాటిని నిర్వహిస్తుండటంతో విద్యార్థులు ఆసక్తిని బట్టి తరగతులకు హాజరవుతున్నారని సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు చెబుతున్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారో ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు రోజువారీ కార్యాచరణ అమలు చేస్తున్నారు. వారి సందేహాలను నివృతి చేస్తూ వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నారు.

వేసవి సెలవులను కోల్పోతున్న ఉపాధ్యాయులు..

సప్లిమెంటరీ శిక్షణ పేరుతో విద్యాశాఖ ఉపాధ్యాయులకు బాధ్యత అప్పగించడంతో ఉన్నత పాఠశాలల సబ్జెక్టు టీచర్లు వేసవి సెలవులను కోల్పోతున్నారు. వారికి వేసవి సెలవులు లేకుండా చేస్తే జీఓ నంబరు–35 ప్రకారం ప్రత్యామ్నాయ సెలవులు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

ఫెయిల్ విద్యార్థుల వివరాలిలా..

ఐదు హైస్కూళ్ల పరిధిలో 85 మంది ఫెయిల్ అయ్యారు. వారిలో తెలుగులో 6, ఇంగ్లిష్‌లో 2, లెక్కల్లో 42, సైన్స్‌లో 29, సోషల్‌లో 6 గురు విద్యార్థులు ఫెయిల్ అయ్యారని అధికారులు చెబుతున్నారు.

ఇంటి దగ్గర చదివేలా చూడాలి



ఫెయిల్ అయిన వారి కోసం పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. విద్యార్థులు పదిలో తప్పిపోయినా వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తిరిగి పరీక్షల్లో గట్టెక్కేలా వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేస్తున్నాం. విద్యార్థులు ఫలితాల్లో మెరుగైన మార్కులు సాధించేందుకు మెలకువలతో పాటు అవగాహన కల్పిస్తున్నాం.సంబంధిత ఉపాధ్యాయులు వారి సందేహాలను నివృతి చేస్తున్నారు. విద్యార్థులు ఇంటి వద్ద కూడా చదివేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలి. – నాగేంద్ర, హెచ్‌ఎం, యాళ్లూరు

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



పదిలో ఫెయిల్ అయిన ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. త్వరలో పదిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రత్యేక తరగతులతో ఉత్తీర్ణత శాతం మరింత మెరుగుపడుతుంది. విద్యార్థులకు సమయం చాలా తక్కువగా ఉంది కావున ప్రతిఒక్కరూ ఉత్తీర్ణత సాధించాలి. – అబ్దుల్‌కరీం, ఎంఈఓ, గోస్పాడు

ఉర్దూ పాఠశాలల అప్‌గ్రేడ్ హర్షణీయం

నంద్యాల(న్యూటౌన్): ఉర్దూ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడం హర్షణీయమని హెచ్‌ఎం అబ్దుల్‌అజీజ్, సమ్మద్ పేర్కొన్నారు. గురువారం యూపీ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉర్దూ అప్పర్ ప్రైమరీ స్కూళ్లను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసి పేద ముస్లిం పిల్లలు డ్రాప్ ఔట్ కాకుండా ఉన్నత చదువులు చదువుకునేందుకు అవకాశం కలిగించడం అభినందనీయమన్నారు. పేరెంట్స్ కమిటీ సభ్యులు నవాజ్ బాషా, కలీముల్లా, ఉపాధ్యాయులు, పీఎంసీ చైర్మన్ మాలాన్‌బీ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ మరమ్మతులపై శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా సెల్‌ఫోన్ మరమ్మతులు సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పుష్పక్ గురువారం తెలిపారు. శిక్షణ అర్హతలు 18–40 సంవత్సరాల్లోపు, ఎస్ఎస్‌సీ పాసైన అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామని చెప్పారు. దరఖాస్తు చేసుకొనే అభ్యర్థులు ఆరు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంక్ ఖాతా విద్యార్హత జిరాక్స్ కాపీలు అందజేయాలన్నారు. వివరాలకు సెల్: 9000710508 నంబరులో సంప్రదించాలని కోరారు.

అర్హులందరికీ కౌలు గుర్తింపు కార్డులు



మాట్లాడుతున్న ఏఓ సుధాకర్



కౌలు రైతులకు కార్డును అందజేస్తున్న ఏఓ రంగనేతాజీ

శిరివెళ్ల: అర్హులైన కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు జారీ చేస్తామని ఏఓ సుధాకర్ తెలిపారు. గురువారం కోటపాడు, గోవిందపల్లె రైతు సేవా కేంద్రల్లో కౌలు గుర్తింపు కార్డులపై అవగాహన కల్పించారు. ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందే అర్హులయిన రైతులకు కౌలు రైతు గుర్తింపు కార్డులను జారీ చేస్తున్నామన్నారు. అందుకు ప్రతి రైతు సేవా కేంద్రంలో తమ సిబ్బంది రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. గుర్తింపు కార్డులున్న రైతుల మాత్రమే పంటల నమోదు జరుగుతుందన్నారు. పంటల బీమా వర్తింపు, మద్దతు ధర ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు రసూల్, నరసింహుడు, సేవా కేంద్రాల వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు గుర్తిపు కార్డుతో ప్రయోజనాలు

చాగలమర్రి: కౌలు గుర్తిపు కార్డుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రంగనేతాజీ తెలిపారు. మండల కేంద్రంలోని మూడవ రైతుసేవా కేంద్రంలో గురువారం పంట సాగు హక్కు, కౌలు కార్డుపై కౌలు రైతులకు అవగాహన కల్పించారు.

కౌలు గుర్తింపు కార్డు వల్ల భూ యజమానికి సంబంధం లేకుండా కౌలు రైతులు బ్యాంకుల ద్వారా పంట రుణం పొందవచ్చన్నారు. స్థానిక వీఆర్‌ఓను సంప్రదించి ఆధార్, పట్టాదార్ పాసు పుస్తకం, భూ యజమాని ఆధార్, కౌలు అగ్రిమెంట్ జిరాక్స్ అందజేసి కౌలు గుర్తింపు కార్డు పొందాలని సూచించారు.

ప్రజలను అప్రమత్తం చేయండి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

గోస్పాడు: ఆరోగ్య విషయాలపై సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న ఎంసీహెచ్ బ్లాక్‌లో గురువారం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కామేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా లైన్ డిపార్ట్‌మెంట్ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. డెంగీ వ్యాధి మంచినీటిలో పెరిగే ఏడీస్ ఈజిప్టి దోమ కాటు వల్ల వస్తుందన్నారు. దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని, మురుగు నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తే ఈ వ్యాధిని అరికట్టవచ్చన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కామేశ్వరరావు మలేరియా చికిత్స విధానాన్ని వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈ మనోహర్, మత్స్య శాఖ అధికారి రాఘవరెడ్డి, డాక్టర్లు సుధాకర్ బాబు, కాంతారావు నాయక్, భరత్ కుమార్, తేజశ్విని, ప్రసన్నలక్ష్మి, ఏఎంఓ ఇన్‌చార్జి రామ విజయారెడ్డి పాల్గొన్నారు.

నక్కిరామన్న ఆశయాలను సాధిస్తాం



రక్తదానం చేస్తున్న నాయకులు



గోస్పాడులో నక్కి రామన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): భూ పోరాట యోధుడు ప్రజా ఉద్యమ నాయకుడు నక్కిరామన్న ఆశయాలను సాధిస్తామని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నక్కిరామన్న 35వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ, ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన వర్ధంతి సభను ఉద్దేశించి రంగనాయుడు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్ మాట్లాడారు. పెత్తందారుల ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటం చేశారని గుర్తు చేశారు. రంగనాయుడుతో పాటు సోమన్న, ప్రతాప్, శశిధర్‌రెడ్డి, చందు, శ్రావణ్, ప్రదీప్‌లు రక్తదానం చేశారు. నాయకులు బాబాఫకృద్దీన్, లక్ష్మీదేవి, సుశీలమ్మ, మౌలాలి, వెంకటేశ్వర్లు, హరినాథ్, సంజీవులు పాల్గొన్నారు.

గోస్పాడు: కామ్రేడ్ నక్కి రామన్న ఆశయ సాధన కోసం పనిచేయాలని నంద్యాల జిల్లా మహిళా సమాఖ్య నాయకురాలు లక్ష్మీదేవి అన్నారు. నక్కి రామన్న 35వ వర్ధంతిని గోస్పాడు మండల సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తన ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా పేద ప్రజల పక్షాన పోరాటాన్ని ఆపలేదని చెప్పారు. చదువు రాకపోయినప్పటికీ జైల్లో ఉంటూ పేపర్ చదవడం, అక్షర జ్ఞానాన్ని సంపాదించారన్నారు. హరినాథ్ హుసేని, ఆచారి, రాములమ్మ, నరసింహులు, సరిత, వినోద్, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కౌలు రైతులు సాగు హక్కు పత్రాలు పొందాలి



మాట్లాడుతున్న డీఏఓ మురళీకృష్ణ

నంద్యాల(అర్బన్): కౌలుకు భూమి సాగు చేస్తున్న ప్రతి రైతు పంట సాగు హక్కు పత్రాలు కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని పులిమద్ది, రాయమాల్పురం గ్రామాల్లో గురువారం కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఏఓ మాట్లాడుతూ కౌలు రైతులు హక్కు పత్రాలు కలిగి ఉంటేనే ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్, పంట దిగుబడుల అమ్మకాలకు అవకాశం ఉంటుందన్నారు. పంట సాగుదారు హక్కు పత్రాలు ఇవ్వడానికి భూ యజమానులు సహకరించాలని, వారు భూమిపై ఎటువంటి హక్కులు కోల్పోరని చెప్పారు. కౌలుకు సాగు చేస్తున్న ప్రతి రైతు వీఆర్‌ఓలను సంప్రదించి పంట సాగుదారు పత్రాలు పొందాలన్నారు. ఏడీఏ రాజశేఖర్, సర్పంచ్, రఘురామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, వీఆర్‌ఓ వెంకటసుబ్బారెడ్డి, అశోక్, స్వర్ణశ్రీ, భీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

నంద్యాల(న్యూటౌన్):స్థానిక ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాన్సన్ గ్రూప్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఫాదర్ జాన్‌దేవదాసు, ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ గురువారం తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మొత్తం 24 కంపెనీలు పాల్గొంటాయని, ఐటీఐ, డిప్లొమో, బీటెక్, ఎంటెక్, బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ, పీజీ వారికి తగిన అవకాశాలు ఉంటాయని చెప్పారు. ప్రైవేటు బ్యాంకులు, ఫార్మా, ఆటో మొబైల్ తదితర కంపెనీలు పాల్గొంటాయని, 2వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సౌభాగ్య పొడి విక్రయిస్తే చర్యలు

ఉయ్యాలవాడ: సౌభాగ్య పొడి(పేడ రంగు) విక్రయిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు దుకాణదారులను హెచ్చరించారు. బుధవారం ఆర్.పాంపల్లె గ్రామంలో పేడ రంగు పొడి నీళ్లలో కలుపుకొని తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం పత్రికల్లో వచ్చిన కథనాలపై అధికారులు గురువారం స్పందించారు. ఎంపీడీఓ ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తుడుమలదిన్నె గ్రామంలో దుకాణాదారులకు నోటీసులు అందజేశారు. సౌభాగ్య పొడి విక్రయించినట్లు, వినియోగించినట్లు తమ దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంటు మౌలాలి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు మీడియాన్ని కొనసాగించాలి

నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, తెలుగు మీడియంను కొనసాగించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు, పుల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేవలం ఇంగ్లీష్ మీడియం మాత్రమే కొనసాగించి తెలుగు మీడియంను పునరుద్ధరించకపోవడం దురదృష్టకరమన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని తెలుగు మీడియంను కొనసాగించాలని కోరారు. ఉపాధ్యాయులు ఖాళీల ఆప్షన్‌ను ఎంచుకొనే సందర్భంలో ప్రాథమిక పాఠశాలను 40శాతం, ఉన్నత పాఠశాల 50శాతం ఖాళీలను మాత్రమే ఎంపిక చేసుకోవాలనే నిబంధన సరికాదన్నారు. ఉమర్, రవి, మునిస్వామి, పవన్‌కుమార్, శ్రీరాములు, జయరాం పాల్గొన్నారు.

తైక్వాండో శిక్షణలో క్రీడాకారులకు ప్రశంస

నంద్యాల(న్యూటౌన్): న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లాలో నిర్వహించిన జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమంలో ముగింపు రోజున ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు నంద్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉమ్మడి జిల్లా సెక్రెటరీ అబ్దుల్ మజీద్ గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ తైక్వాండో శిక్షణ ఇచ్చేందుకు తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆహ్వానించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు తైక్వాండో పోటీల్లో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా మెళకువలు నేర్పించడం అభినందనీయమన్నారు. శిక్షణలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా క్రీడాకారులకు విజయనగరం డీఎస్‌ఓ వెంకటేశ్వరరావు, ఇరాన్, కోచ్ అబ్బాస్ షేక్ ప్రశంసా పత్రాలు అందజేశారు.

19 నుంచి అమ్మవార్ల ఉత్సవాలు



పెద్దయమ్మనూరులో తిరునాలకు ముస్తాబయిన ఆలయం

ఉయ్యాలవాడ: మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామంలో ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు అంకాలమ్మ, చౌడేశ్వరి దేవి, గంగమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 19న శ్రవణా నక్షత్రయుక్త, గంగా భవాని జల్దిస్నానం, అఖండ స్థాపన, 20న ధనిష్ట నక్షత్ర ముక్త, గంగా భవాని వీరుల పూజ, 21న యాదవుల బోనాలు, రాత్రికి గంగ మేళం, 22న ఆవుల పందెం, మద్దిమాను నరకడం, 23న దీవెన బండారు తదితర కార్యక్రమములు ఉంటాయన్నారు.

రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

అమ్మవార్ల ఉత్సవాల సందర్భంగా ఎడ్ల బండ లాడుగు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 22న న్యూ కేటగిరిలో, 23న నాలుగు పండ్ల వృషభాల పోటీలతోపాటు అదే రోజు ట్రాక్టర్ రివర్స్ పందెం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సిద్ధేశ్వరం, గుండ్రేవులపై నోరు మెదపని ప్రభుత్వం



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం గుండ్రేవుల రిజర్వాయర్, వేదవతి ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వం ఇప్పటికీ కార్యాచరణ చేయకపోవడంపై రాయలసీమ సమాజం తీవ్ర ఆవేదనలో ఉందని, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం మరువడం దారుణమన్నారు. స్థానిక సమితి కార్యాలయంలో సిద్ధేశ్వరం అలుగు 9వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 31న సంగమేశ్వరంలో నిర్వహించే బహిరంగ సభకు సంబంధించిన గోడపత్రికలను సమితి సభ్యులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2009లో వచ్చిన వరదల వల్ల శ్రీశైలం ప్రాజెక్టు భద్రత ప్రమాదస్థాయికి చేరిందన్నారు. ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. అలగనూరు, గోరుకల్లు రిజర్వాయర్లపై ముఖ్యమంత్రి క్షేత్రస్థాయి నివేదికలు తెప్పించుకొని కార్యాచరణ చేపట్టాలన్నారు. శిథిలావస్థకు చేరకముందే సీమ ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్‌చేశారు. కృష్ణానది యాజమాన్య బోర్డును కూర్నూలులో కాకుండా అమరావతికి తరలించడం దుర్మార్గమన్నారు. రాయలసీమ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల క్షేత్రస్థాయి స్థితిగతులపై చర్చించడానికి సీఎం చొరవ చూపాలన్నారు. సమితి ఉపాధ్యక్షులు వైఎన్ రెడ్డి, న్యాయవాది అసదుల్లా, సుధాకర్‌రావు, భాస్కరరెడ్డి, కొమ్మా శ్రీహరి, కృష్ణమోహన్‌రెడ్డి, రాముడు, జానో జాగో కన్వీనర్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఏపీ ఈసెట్‌లో విద్యార్థులకు ర్యాంకులు



పెరుమాళ్ల రాహుల్, శ్రీకాంత్, ప్రణీతారెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఏపీ ఈసెట్ ఫలితాల్లో నంద్యాల జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. మే 6న పరీక్షలు జరుగగా.. గురువారం వెలువడిన ఫలితాల్లో నందికొట్కూరుకు చెందిన పెరుమాళ్ల రాహుల్ 83 మార్కులతో 6వ ర్యాంకు, బేతంచెర్లకు చెందిన గుమ్మ శ్రీకాంత్ 131 మార్కులతో 10వ ర్యాంకు సాధించారు. అలాగే.. డోన్‌కు చెందిన అప్పల ప్రణీతారెడ్డి 94 మార్కులతో 6వ ర్యాంకు సాధించాడు. జిల్లాలో 801 మంది విద్యార్థులు పరీక్షలకు రిజిస్టర్ చేసుకోగా 792 మంది హాజరయ్యారు. అందులో 736 మంది అర్హత సాధించారు. వారిలో బాలురు 91.36 శాతం, బాలికల 97.52 శాతంతో మొత్తం మీద 92.93 శాతం ఉత్తీర్ణత సాధించారు.



కొత్తవెలగలపల్లె వద్ద తడిసిన ధాన్యాన్ని చూపుతున్న దృశ్యం,



చిన్నకంబలూరు వద్ద రోడ్డుకు అడ్డంగా విరిగి పడిన వృక్షం

రుద్రవరంలో భారీ వర్షం

రుద్రవరం: మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారు జాము వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు వృక్షాలు సైతం నేలకొరిగాయి. మండల వ్యాప్తంగా 50.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కోటకొండ, ఎల్లావత్తుల, డి.కొట్టాల, అప్పనపల్లె, కొత్త వెలగలపల్లె తదితర గ్రామాల పరిధిలో రైతులు ఆరుబయట ఆరబెట్టుకున్న వరి, మొక్క జొన్న తదితర దిగుబడులు తడిసి పోయాయి. చిన్నకంబలూరు వద్ద ఓ భారీ వృక్షం విరిగి పడింది. బి.నాగిరెడ్డిపల్లె–పేరూరు మధ్య రెండు వృక్షాలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. రెడ్డిపల్లె వద్ద చెట్టుపై పిడుగు పడటంతో దెబ్బతినింది.



రెడ్డిపల్లె వద్ద పిడుగుపాటుకు దెబ్బతిన్న చెట్టు

గడ్డివాములపై పిడుగు



కాలిన గడ్డివాములను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి పుల్లయ్య

దొర్నిపాడు: మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. క్రిష్టిపాడు గ్రామానికి చెందిన రైతులు మద్ది నాగరాజు, మద్ది సుబ్బరావుల గడ్డివాములపై పిడుగు పడటంతో పూర్తిగా కాలిపోయాయి. ఆళ్లగడ్డ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేసినా ఫలితం లేకపోయింది. దాదాపు రూ.3 లక్షల విలువ చేసే గ్రాసం కాలిబూడిదైంది. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి పుల్లయ్య గడ్డివాములను పరిశీలించారు. కాగా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు తహసీల్దార్ సుభద్రకు వినతి పత్రం అందజేశారు.